
ప్రజాశక్తి
ఆదివారం 10 నవంబర్ 2024



నలుగురికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు

ప్రజాశక్తి-పార్వతీపురం

పార్వతీపురం మన్యం జిల్లా నుంచి నలుగురికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు దక్కాయి. ఈ మేరకు శనివారం సాయంత్రం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను ప్రకటించింది. కొమరాడ ఎపి గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల (బాలురు) ప్రిన్సిపల్ డి.లక్ష్మణరావు, మక్కువ మండలం ఎ.వెంకంపేట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఫిజిక్స్ ఉపాధ్యాయులు గొంగాడ రామారావు, పాలకొండ ఎంపియుపి పాఠశాల సోషల్ స్టడీస్ ఉపాధ్యాయులు జంపా జయమణి, పాచిపెంట మండలం నూరువరహాలపాడు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు పొన్నూరు ఈశ్వరరావును ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు లభించాయి. వీరికి ఈనెల 11న మంగళగిరిలో రాష్ట్ర ప్రభుత్వం అవార్డులను అందజేయనుంది.

కొన్ని ఉద్యోగాలు పేరుకే ప్రభుత్వ కొలువులు. నిత్యం వెట్టిచాకిరే. పనికి తగ్గ ఫలితం లేకపోవడంతో కనీసం కుటుంబాలను కూడా పోషించలేని పరిస్థితి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మారినా వారి జీవితాల్లో మార్పు మాత్రం రావడం లేదు. 22 ఏళ్లుగా పనిచేస్తున్నా ఇంకా రూ.5 వేలు వేతనానికే పరిమితమయ్యారు. వారే ఆదివాసీ మాతృ బహు భాషా విద్యా వాలంటీర్లు (సవర భాషా విద్యా వాలంటీర్లు). గిరిజన విద్యాభివృద్ధి కోసం నిత్య విద్యార్థుల్లా వీరు అహర్నిశలు కృషి చేస్తున్నారు. అలాంటి వారిని పాలకులు నిర్లక్ష్యంగా వదిలేశారు. ఇప్పటికే పలుమార్లు ధర్నాలు, ఆందోళనలు చేసినా, గల్లీ నుంచి ఢిల్లీ వరకు వినతులు అందజేసినా ప్రయోజనం కనిపించలేదు.



ఐటిడిఎ వద్ద ధర్నా చేస్తున్న సవర భాషా వాలంటీర్లు (ఫైల్)

- 22 ఏళ్లుగా పనిచేస్తున్నా రూ.5 వేలే వేతనం
- క్రమబద్ధీకరణకు నోచని వైనం
- ఇదీ ఆదివాసీ మాతృ బహు భాషా విద్యా వాలంటీర్ల దుస్థితి

పని ఎక్కువ.. ఫలితం తక్కువ

ప్రజాశక్తి-సీతంపేట



మంత్రి లోకేష్‌కి వినతి అందిస్తున్న సవరభాషా వాలంటీర్ (ఫైల్)

కొండశివారు ప్రాంతాల్లో విద్యార్థులు పాఠశాలకు వెళ్లకుండా బడి బయట కనిపించడంతో అప్పటి ఐటిడిఎ పిఒ.. అక్షర క్రాంతి కళాజాతా బృందం పేరుతో సర్వే చేపట్టారు. ఆ సర్వేలో పిల్లలు తెలుగు భాషపై ఆసక్తి చూపకపోవడంతో.. 2002లో అప్పటి పిఒ సవరభాషా విద్యా వాలంటీర్లను నియమించారు. అందుకోసం ఐపాడ్ నిధులు కేటాయించి, అప్పట్లో రూ.వెయ్యి వరకు వేతనం ఇచ్చేవారు. ముందుగా ఐటిడిఎ పరిధిలో 20 పాఠశాలలతో ప్రారంభించారు. సవరభాషలో విద్యను బోధించడంతో విద్యార్థులు ఆసక్తి చూపారు. ప్రాథమిక పాఠశాలల్లో తమ భాషలో విద్యార్థులకు విజ్ఞానాన్ని నేర్పిస్తూ పునాది వేసుకుంటూ వారి విద్యాభివృద్ధికి తోడ్పడుతున్నారు.

కొన్ని రాష్ట్రాల్లో రెగ్యులర్

2022లో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు కేంద్రం రూ.5 వేలు అందిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా అక్కడున్న ఆర్థిక పరిస్థితులను బట్టి మీరు ఎంతో కొంత ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. అయితే దానికి అనుగుణంగా ఒడిశా రాష్ట్రం ఆదివాసీ మాతృ బహుభాషా విద్యా వాలంటీర్లను రెగ్యులర్ చేస్తూ, రూ.22 వేలు జీతం ప్రకటించింది. కేరళ, త్రిపుర, జార్ఖండ్, చత్తీస్‌గడ్ రాష్ట్రాల్లో రెగ్యులర్ చేసినట్లు తెలిసింది.

దీంతో మిగతా పాఠశాలల్లోనూ సవర భాషా వాలంటీర్లను నియమించారు. ప్రస్తుతం సీతంపేట ఐటిడిఎ పరిధిలో 153 పాఠశాలల్లో 153 మంది వారు పనిచేస్తున్నారు. రాష్ట్రంలో 1370 మంది వరకు ఉన్నారు. అన్ని పాఠశాలల్లోనూ సవర భాషా విద్యా వాలంటీర్లు ఉంటూ ఆ విద్యార్థులకు వారి భాషలో విద్యాబోధన చేస్తారు. సీతంపేట ఐటిడిఎ పరిధిలో సవరభాష, కెఆర్‌పురం ఐటిడిఎ పరిధిలో కోయ, రాయలసీమలో సోగ్గాడి, పాడేరులో ఆదివాసీ ఒరియాలో బోధన చేస్తుంటారు. దీనివల్ల ఆదివాసీ ప్రాంతాల్లో చిన్నారులు చదువుపై ఆసక్తి చూపుతున్నారు.

ఎంపిక విధానం కష్టమే

సవరభాషా విద్యా వాలంటీర్‌గా పనిచేయాలంటే డిగ్రీతో పాటు బిఇడిని ప్రామాణికంగా తీసుకుంటారు ఖాళీగా ఉన్నచోట భర్తీ చేసినప్పుడు ఉన్నతాధికారుల విద్యాకమిటీ ఎంపిక చేస్తుంది. పిఒ ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ జరుగుతుంది. ఎంపికైన వారి జాబితాను సమగ్రశిక్ష డైరెక్టర్‌కు పంపిస్తారు. అక్కడ నుండి వేతనం పడుతుంది.

22 ఏళ్లుగా సేవలందిస్తున్నా..

ఇప్పటికి సుమారు 22 ఏళ్లుగా సవరభాషా వాలంటీర్లు విద్యార్థులకు బోధిస్తున్నారు. ఉదయం తొమ్మిది నుండి సాయంత్రం 3:45 గంటల వరకు అన్ని సబ్జెక్టులు బోధిస్తున్నారు. అలాంటి ఆదివాసీ మాతృ బహుభాషా విద్యా వాలంటీర్లను రెగ్యులర్ చేయాలని, లేకుంటే సిఆర్‌టిల మాదిరిగా టైంస్కేల్ ప్రకటించాలని పలుమార్లు మంత్రులకు, అధికారులకు, గ్రీవెన్స్‌లో వినతులు సమర్పించారు. జీతాలు చాలడం లేదని వంటావార్పు, ధర్నాలు, రాస్తారోకోలు, దీక్షలు చేపట్టారు. అయినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనికరించలేదు. గత ఎన్నికల సమయంలో సిఎం చంద్రబాబునాయుడుకు అరకు బహిరంగ సభలో వినతులిచ్చారు. యువగళం పాదయాత్రలో పాయకరావుపేటలో ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కి విన్నవించారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించి, అధికారంలోకి వస్తే ప్రకటిస్తామని హామీనిచ్చారు. ప్రభుత్వం వచ్చి ఐదు నెలలు గడుస్తున్నా నోరు మెదపడం లేదు.

రెగ్యులర్ చేయాలి



ఒడిశా రాష్ట్రం మాదిరిగా సవర భాషా వాలంటీర్లను రెగ్యులర్ చేయాలి. లేదంటే సిఆర్‌టిల మాదిరిగా టైంస్కేల్ ప్రకటించాలి. రాష్ట్ర విద్యాశాఖలో విలీనం చేయాలి. 12 నెలలూ జీతాలు చెల్లించాలి.

– సవరణ డొంబు, ఆదివాసీ మాతృ బహుభాషా విద్యా వాలంటీర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి

ప్రతినెలా వేతనం చెల్లించాలి



విద్యార్థుల కోసం ఎంతో కష్టపడుతున్నాం. నెల నెలా జీతాలు చెల్లించాలి. రూ.5 వేలు వేతనం కనీసం రవాణా ఛార్జీకే చాలడం లేదు. జీతాలు పెంచాలి. క్రమబద్ధీకరణ చేయాలి. వీటిపై అధికారులకు, పాలకులకు వినతులు అందించాం.

– సవర ఎల్లంగో, ఆదివాసీ మాతృ బహుభాషా విద్యా వాలంటీర్ల సంఘం జిల్లా కోశాధికారి





వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న విజయనగరం కలెక్టర్ అంబేద్కర్ ; వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

ఉత్సాహంగా వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి-భోగాపురం

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 68వ రాష్ట్రస్థాయి అండర్ -14 వాలీబాల్ పోటీలు శనివారం విజయనగరం జిల్లా భోగాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఉత్సాహ పూరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు నిర్వహించే ఈ పోటీలకు రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుంచి 26 బాల బాలికల జట్లు హాజరయ్యాయి. విజయనగరం కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఈపోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీల్లో రాణించి, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఐపిఇ జి.భానుమూర్తి రాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడా రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పాఠశాల క్రీడా పోటీల నిర్వహణకు ఈ ఏడాది ప్రభుత్వం సుమారు రూ.7.4 కోట్లను మంజూరు చేసిందన్నారు.

ముందుగా జిల్లా కలెక్టర్ అంబేద్కర్ జాతీయ పతాకావిష్కరణ చేశారు. క్రీడాకారుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. క్రీడాజ్యోతిని వెలిగించారు. పోటీలకు హాజరైన బాల బాలికలతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా భోగాపురం కెజిబివి విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమం ఆకట్టుకుంది.

అనంతరం నిర్వహించిన పోటీల్లో నెల్లూరు జట్టుపై విజయనగరం జట్టు విజయం సాధించింది. కార్యక్రమంలో ఎస్‌జిఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కృష్ణంరాజు, తదితరులు పాల్గొన్నారు.

సెలవుల్లో తరగతులు
నారాయణ స్కూల్ ఎదుట ఆందోళన

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్




నారాయణ స్కూల్ ఎదుట ఆందోళన చేస్తున్న ఎస్‌ఎఫ్ఐ నాయకులు

పట్టణంలోని నారాయణ పాఠశాల ఎదుట ఎస్‌ఎఫ్ఐ ఆధ్వర్యాన శనివారం ధర్నా చేపట్టారు. రెండో శనివారం సెలవు ప్రకటించకుండా తరగతులు నిర్వహించడం దారుణమని ఎస్‌ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు టి.అఖిల్ అన్నారు. ప్రభుత్వ నిబంధనలు గాలికి వదిలేసి, తరగతులు నిర్వహిస్తున్న ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని విద్యాశాఖ అధికారులను ప్రశ్నించారు. కార్పొరేట్ విద్యాసంస్థలలో ర్యాంకులనే పరమావధిక భావించి విద్యార్థులపై అధిక చదువుల ఒత్తిడి భారాన్ని యాజమాన్యం మోపుతోందని తెలిపారు. దీనివల్ల విద్యార్థులు మానసికంగా ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. విద్యాశాఖ అధికారులు స్పందించి ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థలపై తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు కె.డేవిడ్, సురేష్, శ్రీను, అభి, వెంకీ, రాజేష్ పాల్గొన్నారు.

మన్యానికి మొండిచేయి

నామినేటెడ్ రెండో జాబితాలో నిరాశ

ప్రజాశక్తి-పార్వతీపురం



నామినేటెడ్ పదవుల రెండో విడత పందేరంలో మన్యం జిల్లా నాయకులకు టిడిపి కూటమి ప్రభుత్వం మొండి చేయి చూపించింది. మొదటి విడత నామినేటెడ్ పోస్టుల భర్తీలో గిరిజన నాయకురాలు లావణ్యను ట్రైకార్ సంస్థ డైరెక్టర్‌గా నియమించారు. రెండో విడత నామినేటెడ్ పదవుల జాబితాను శనివారం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ జాబితాలో మన్యం జిల్లా నుంచి ఒక్కరికీ చోటు దక్కలేదు. మొదటి విడతలో ఉమ్మడి విజయనగరం జిల్లాలోని మాజీ ఎమ్మెల్యేలు ఆర్‌పి భంజ్ దేవ్, గద్దె బాబూరావును సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డైరెక్టర్లుగా నియమించారు. ఇద్దరు సీనియర్ నాయకులు ఆ పదవులను స్వీకరించలేదు. రెండో విడత జాబితాలో జిల్లాలో ఉన్న బిసి, ఎస్‌టి నాయకుల్లో ఒక్కరికీ చోటు దక్కలేదు. మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీశ్, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులుకు అవకాశమివ్వలేదు. విజయనగరం జిల్లాలో బొబ్బిలి నియోజకవర్గానికి చెందిన ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు సుజయ్‌కృష్ణ రంగారావు, తెంటు లక్ష్మునాయుడుకు ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, బుడా చైర్మన్ పదవులు దక్కాయి. జిల్లాలో నాలుగు నియోజకవర్గాల్లోనూ టిడిపికి బలమైన బిసి, ఎస్‌టి నాయకులున్నారు. సాలూరు నియోజకవర్గంలో టిడిపి సీనియర్ నాయకులు పిన్నింటి ఈశ్వరరావు, చలుమూరి వెంకటరావు, మావుడి ప్రసాద్ నాయుడు, మాజీ ఎమ్మెల్యే భంజ్‌దేవ్ ఉన్నారు. పార్వతీపురం నియోజకవర్గంలో మాజీ ఎంపిపి సీనియర్ నాయకులు గొట్టాపు వెంకటనాయుడు, కురుపాం నియోజకవర్గంలో సీనియర్ నాయకులు దత్తి లక్ష్మణరావు, డొంకాడ రామకృష్ణ, వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్, పాలకొండలో పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పడాల భూదేవి ఉన్నారు. మూడు ఎస్‌టి నియోజకవర్గాలు, ఎస్‌సి నియోజకవర్గాల్లో టిడిపి గెలుపు కోసం కృషి చేసిన నాయకుల్లో ఎక్కువ మంది బిసిలే ఉన్నారు. నాలుగు నియోజకవర్గాల్లోనూ ఒక్క బిసి నాయకుడికీ నామినేటెడ్ పదవుల భర్తీలో ప్రాధాన్యత ఇవ్వకపోవడం గమనార్హం.

విద్యార్థుల మరణాలు దారుణం

మృతిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టాలి : మాజీ డిప్యూటీ సిఎం శ్రీవాణి



విద్యార్థులతో మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సిఎం శ్రీవాణి

ప్రజాశక్తి-జియ్యమ్మవలస

గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి సొంత జిల్లాలో ఈ ఏడాది 8 మంది విద్యార్థులు మృతి చెందడం దారుణమని మాజీ డిప్యూటీ సిఎం పాముల పుష్ప శ్రీవాణి అన్నారు. ముమ్మాటికీ ఇది ప్రభుత్వ వైఫల్యమేనని ఆక్షేపించారు. రావాడ రామభద్రపురం ఘటనలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోకుండా అట్టహాసం చేసి మంత్రి సంధ్యారాణి వెళ్లిపోయారని ధ్వజమెత్తారు. శనివారం మండలంలోని రావాడ రామభద్రపురం ఆశ్రమ పాఠశాలను ఆమె సందర్శించారు. గిరిజన విద్యార్థి జీవన్ కుమార్ మృతి పట్ల ఆరాతీశారు. జీవన్ స్నేహితులు ప్రేమకుమార్, సిద్ధును అన్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీవాణి మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా గుమ్మిడి సంధ్యారాణి పదవి చేపట్టిన నుంచి జిల్లాలో 8 మంది విద్యార్థులు మృతి చెందడం చాలా దారుణమన్నారు. కేవలం కురుపాం నియోజకవర్గంలోనే ఈ ఐదు నెలల్లో ఏడుగురు గిరిజన విద్యార్థులు పిట్టల్లా రాలిపోతే ఇంతవరకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదని ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. విద్యార్థి జీవన్ కుమార్ ఆకస్మిక మృతిపై మంత్రి సంధ్యారాణి పూర్తి దర్యాప్తు నిర్వహించకుండా మమా అనిపించారని, వాస్తవాలను చెబుతున్న ప్రజాసంఘాల, గిరిజనుల నోరు నొక్కేశారని మండిపడ్డారు. మంత్రి సంధ్యారాణి ఎంతసేపూ ప్రతిపక్షంపై దుమ్మెత్తి పోయడం తప్ప కనీసం జిల్లాలో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. ఇంత జరుగుతున్నా కనీసం ఐటిడిఎ అధికారులతో సమీక్షా సమావేశాన్ని కూడా నిర్వహించకపోవడం సిగ్గుచేటని దుయ్యబట్టారు. మంత్రిగా ప్రమాణం చేసిన తర్వాత మొదటి సంతకాన్ని వైద్య శాఖలో ఎఎన్‌ఎంల నియామకం చేపడతామని హామీ ఇచ్చి, గాలికి వదిలేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇచ్చిన హామీను నెరవేర్చని మంత్రిని జీవన్ కుమార్ కుటుంబ సభ్యులు ఎలా నమ్ముతారని నిలదీశారు. ఏదేమైనప్పటికీ జీవన్ కుమార్ మృతిపై సమగ్ర విచారణ చేపట్టి ఆ కుటుంబానికి న్యాయం చేయకుంటే వామపక్షాలు, ప్రజా సంఘాలతో కలిసి జిల్లా కేంద్రంలో నిరసనలు నిర్వహిస్తామని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఎం.శశికళ, మాజీ జెడ్‌పిటిసి కద్రక బలరాం, వైసిపి నాయకులు, ఎస్‌ఎఫ్ఐ, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అశ్రద్ధ వహిస్తే కఠిన చర్యలు

ఉపాధ్యాయ సిబ్బందిపై ఐటిడిఎ పిఒ ఆగ్రహం

ప్రజాశక్తి-జియ్యమ్మవలస

విద్యార్థుల ఆరోగ్యంపై అశ్రద్ధ వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పార్వతీపురం ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాత్సవ.. ఉపాధ్యాయ సిబ్బందిని హెచ్చరించారు. మండలంలోని రావాడ రామభద్రపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థి నిమ్మక జీవన్ కుమార్ మృతిపై శనివారం ఆయన దర్యాప్తు నిర్వహించారు. విద్యార్థులతో మాట్లాడి జీవన్ కుమార్ మృతిపై ఆరాతీశారు. గిరిజనులు తమ పిల్లలను ఎంతో నమ్మకంతో ఆశ్రమ పాఠశాలలో చేర్పిస్తున్నారని, వారి ఆరోగ్యం పట్ల బాధ్యతారహితంగా వ్యవహరించొద్దని ఆయన హెచ్చరించారు. విద్యార్థులకు పెడుతున్న ఆహారంలో నాణ్యత లోపిస్తే సహించేది లేదని హెచ్చరించారు. విద్యార్థులకు రక్షణగా రాత్రి వేళల్లో సిబ్బంది ఉండాలని, వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. అనంతరం విద్యార్థుల గదులు, వంటశాలను పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలున్నా నిర్భయంగా అధికారులతో చెప్పాలని సూచించారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ అశుతోష్

సమస్యలపై దృష్టిపెట్టని పాలకులు

సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

ప్రజాశక్తి-బలిజిపేట



సిపిఎం జెండావిష్కరణలో పాల్గొన్న జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, నాయకులు

ప్రజా సమస్యలపై పాలకులు దృష్టిపెట్టడం లేదని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు తెలిపారు. మండలంలోని పలగర గ్రామంలో శనివారం సిపిఎం మండల మహాసభను బి.భాను అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జెండాను ఆవిష్కరించి, సీతారాం ఏచూరి చిత్రపటానికి సీనియర్ నాయకులు గేదెల సత్యనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహాసభలో రెడ్డి వేణు మాట్లాడుతూ ప్రజా సమస్యలను పాలకులు పరిష్కరించకుండా ప్రజల మధ్య వైషమ్యాలు రెచ్చగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. దీనిపై ప్రజలు చైతన్యవంతమై, సమస్యల పరిష్కారం కోసం చేపట్టే పోరుబాటలో కలిసి రావాలని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఇందిర మాట్లాడుతూ రాష్ట్రంలో మంచినీరు లేదు గానీ తాగడానికి మద్యం పుష్కలంగా అమ్ముతున్నారని ధ్వజమెత్తారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్నా పట్టించుకోకుండా, ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొట్టడానికి లడ్డూ రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. సనాతన ధర్మం అమలు చేయాలని కొంతమంది మతాలు, కులాల మధ్య గొడవలు సృష్టిస్తున్నారని విమర్శించారు.

అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా వై.మన్మథరావు, సభ్యులుగా గేదెల సత్యనారాయణ, బి.భానుమూర్తి, నల్ల ఈశ్వరరావు, దన్నాన త్రినాథ, బలరాం, వెంకటస్వామి, సాంబమూర్తి, వేణుగోపాల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు వంజరాపు సత్యంనాయుడు, అప్పలనరసమ్మ, దుర్గారావు, జగన్నాథం, మజ్జి తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మితడి విచారణలు

ప్రజాశక్తి – విజయనగరం ప్రతినిధి

విచారణ అంటే పారదర్శకంగా జరిగిందా? లేదా? అన్నది సరిచూడడం మాత్రమే కాదు, విచారణ ఒక నిర్దిష్టమైన కాలపరిమితిలోనూ పూర్తిచేయాలి. అప్పుడే తప్పులు, పొరపాట్లు వంటివాటి మధ్య తేడా కూడా తెలుస్తుంది. అధికార దుర్వినియోగం వంటి వాటికి ఆనవాళ్లు దొరుకుతాయి. తప్పుచేసిన వారిపై చర్యలు తీసుకునేందుకు, అలాంటి తప్పులు లేదా పొరపాట్లు, అధికార దుర్వినియోగం వంటివాటిని సరి చేసుకునేందుకు, పునరావృతం కాకుండా చర్యలు తీసుకునేందుకు అవకాశం ఏర్పడుతుంది. కానీ, నేటి ప్రభుత్వాలు ఆదేశిస్తున్న విచారణలు విచారకరంగా మారాయి. విజయనగరం పూర్వ ఆర్‌డిఒ భవానీ శంకర్‌పై విచారణకు, జిల్లాలోని నలుగురు తహశీల్దార్లపై చర్యలకు ప్రభుత్వం కొద్దిరోజుల క్రితం ఉత్తర్వులు జారీచేసిన సంగతి తెలిసిందే. ఎయిర్‌పోర్టు భూముల కొనుగోలు విషయంలో ఆర్‌డిఒ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారన్న అనుమానాలు ప్రభుత్వానికి ఉన్నాయట. తహశీల్దార్లు ప్రభుత్వ భూములను పరిరక్షించలేదట. ఈ మాటకొస్తే భవనీ శంకర్ ఆర్‌డిఒగా పనిచేసిన కాలంలోవున్న జాయింట్ కలెక్టర్ కిశోర్ కుమార్‌ను సరెండర్ చేశారు. ఆయనను ఎందుకు సరెండర్ చేశారో ఇప్పటికీ స్పష్టమైన ప్రకటన లేదు. కానీ, 22ఎలో ఏవో కిరికిరిలు జరిగాయన్నది బహిరంగంగానే చర్చనడిచింది. మరి కిశోర్‌పై ఉన్న అభియోగాలకు, నేడు ఆర్‌డిఒపై ఆదేశించిన విచారణకు సంబంధాలు ఉన్నాయా? లేవా? అన్న సందేహాలు సర్వత్రా వ్యక్తమౌతున్నాయి. ఆ మాటకొస్తే కిశోర్‌పై వేటు పడిన తరువాత కూడా అప్పటి కలెక్టర్ ఆధ్వర్యాన చాలా ప్రభుత్వ భూములపై 22ఎ ఎత్తివేత జరిగింది. మరి అవన్నీ పారదర్శకంగానే జరిగాయా? వాటిపై కూడా విచారణ జరపుతారా? అంటూ తాజాగా విచారణ ఆదేశాలు తెలిసినవారంతా చర్చించుకుంటున్నారు. ఈ సంగతి అటుంచితే, గత ప్రభుత్వంలో 20ఏళ్ల క్రితం పొందిన అసైన్డ్ ల్యాండ్‌ను సంబంధిత సాగుదారుల పేరిట పట్టాలు మంజూరు చేస్తామని గత ప్రభుత్వం 9/2023 ఆర్డినెన్స్ తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. దీన్ని అడ్డం పెట్టుకుని అధికార యంత్రాంగంలో అత్యంత కీలకంగా వ్యవహరిస్తున్న ఓ ఉన్నతాధికారి, ప్రభుత్వ పెద్దలు కలిసి అసైన్డ్ భూములను వశపర్చుకున్నారు. మరో మాటలో చెప్పాలంటే... పెద్దలకిస్తేనే ఆ అసైన్డ్ భూములను ఫ్రీహోల్డ్ చేశారు. ఈ విధంగా విశాఖ జిల్లాలోని భీమిలి, మన జిల్లాలోని భోగాపురం, పూసపాటిరేగ తీరంలో అసైన్డ్ ల్యాండ్ వేలాది ఎకరాలు చేతులు మారింది. పూసపాటిరేగ మండలం కందివలస, చోడమ్మ అగ్రహారం, కనిమెట్ట రెవెన్యూ గ్రామాల పరిధిలో సుమారు 200 ఎకరాల అసైన్డ్ భూములను నాటి ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్సును అడ్డం పెట్టుకుని వశపర్చున్నారు. ఇందుకోసం ప్రైవేటు వ్యక్తులు రంగంలోకి దిగి దళితులు, పేదలను భయపెట్టి, బెదరించి విక్రయ ఒప్పంద పత్రాలు రాయించుకునట్టు కూడా బహిరంగ చర్చనడించింది. రూ.కోట్ల విలువైన భూములను రైతుల నుంచి కారు చౌకగా తీసుకొని రూ.లక్ష, రెండు లక్షల చొప్పున మాత్రమే చెల్లించారు. దాదాపు తీర ప్రాంత అసైన్డ్ భూముల్లో ఎక్కువ శాతం ఇలాగే చేతులు మారాయి. ఈ విషయంలో ఎపిఐఐసి కోసం నాటి టిడిపి ప్రభుత్వం గుర్తించిన భూములను కూడా విడిచిపెట్టలేదు. ఇటువంటి అసైన్డ్, ప్రభుత్వ భూములను వశపర్చుకోవాడానికి ముందే ఏకంగా ఎంపీ నిధులతో సిమెంట్‌రోడ్లు కూడా వేసేసుకున్నారు. భోగాపురంలో అయితే, ఓ బినామి వ్యక్తి ద్వారా అప్పటి ప్రభుత్వ పెద్దలు, ప్రభుత్వంలోని ఓ ఉన్నతాధికారి కలిసి 99ఏళ్ల లీజు ప్రాతిపదికన ప్రభుత్వ భూములను వశపర్చుకున్నారు. ఈ విషయంలో అక్కడి సాగుదారులు అడ్డుతగిలే పరిస్థితి లేకుండా అప్పట్లో ప్రత్యేకంగా రాయలసీమ ప్రాంతం నుంచి ఓ సిఐని కూడా రప్పించారని ఈ ప్రాంత ప్రజానీకం చర్చించుకున్నారు. ఇందుకు సహకరించని ఓ విఆర్ఓపై బదిలీవేటు కూడా పడింది. ఇవి మచ్చుకు మాత్రమే. ఇటువంటి అక్రమాలెన్నో.. వీటన్నింటినీ పక్కనబెట్టి కేవలం అధికారులపైనే గురిపెట్టడం చూస్తుంటే మిగిలినవారిని అదుపులో పెట్టుకోవడం కోసమేనన్నది పబ్లిక్ టాక్.




భద్రగిరి సిహెచ్‌సిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

ఏజెన్సీలో వీడని జ్వరాలు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో గిరిజనులు జ్వరాల బారిన పడుతున్నారు. వైరల్, మలేరియా వంటి జ్వరాలతోపాటు కడుపునొప్పి, కాళ్ల పీకులు, వివిధ రకాల లక్షణాలతో వైద్యం కోసం వస్తున్నారు. వైద్యం కోసం పెద్ద సంఖ్యలో రావడంతో బెడ్లు చాలక ఒకే బెడ్‌పై ఇద్దరు, ముగ్గురిని ఉంచి సేవలందిస్తున్నారు. విద్యార్థులు కూడా జ్వరాల బారిన పడి ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు.

రోడ్డు పనులను అడ్డుకోవడం దారుణం

ప్రజాశక్తి-కొమరాడ

రోడ్డు పనులను మైనింగ్ అధికారులు అడ్డుకోవడం అన్యాయమని సిపిఎం జిల్లా నాయకులు కొల్లి సాంబమూర్తి అన్నారు. పార్వతీపురం-రాయగడ ప్రధాన రహదారిపై పనులు నిలిచిపోవడంతో రోడ్డు పక్కన వాహనాలను నిలిపేశారు. శనివారం అక్కడి వారితో ఆయన మాట్లాడి, వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లుగా రోడ్డు మరమ్మతులకు గురై ఇబ్బందులు పడుతున్న ప్రజలు, ప్రయాణికులకు ఎట్టకేలకు మోక్షం కలిగిందన్న ఆనందం సగంలోనే మిగిలిపోయిందన్నారు. ఈ విషయంపై కలెక్టర్ స్పందించి రోడ్డు పనులు వేగవంతం చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు శివున్నాయుడు పాల్గొన్నారు.

డిఎల్‌టిసి రాష్ట్ర కార్యదర్శిగా కోట్ల శ్రీనివాస్

ప్రజాశక్తి-బొబ్బిలి

ప్రభుత్వ ఐటిఐ డిఎల్‌టిసి అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా కోట్ల శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి సమావేశంలో కోట్ల శ్రీనివాస్‌ను రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ప్రభుత్వ ఐటిఐ ఉద్యోగులు, విద్యార్థులు సమస్యలు పరిష్కారానికి పని చేస్తామని శ్రీనివాస్ చెప్పారు. రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన శ్రీనివాస్‌ను, ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.దేముడును విజయనగరంలో తోటి ఉద్యోగులు, విద్యార్థులు సన్మానించారు. ఐటిఐలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు ప్రతి ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు టెలీ స్పందన నిర్వహిస్తామని చెప్పారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను 95736 44439కు ఫోన్ చేసి చెపితే పరిష్కారానికి పని చేస్తామని చెప్పారు.

నవోదయం 2.0 పై అవగాహన

ప్రజాశక్తి-కొత్తవలస

కొత్తవలస ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిఐ జి.ఎస్. రాజశేఖర్ నాయుడు ఆధ్వర్యంలో నవోదయం 2.0లో భాగంగా జోడి మెరక గ్రామంలో అవగాహన సదస్సు శనివారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటుసారా తయారీ, అమ్మకం అక్రమ మద్యం అమ్మకాలు నిర్వహించకూడదని తెలిపారు. ఒక వేల ఎవరైనా అలాంటి పనులు చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది హెచ్‌సిటి వీర్రాజు, బి.రాముడు, బి. ఆదినారాయణ పాల్గొన్నారు.

నేడు సీతంపేట మండల సమావేశం

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట మండల సమావేశాన్ని ఆదివారం స్థానిక వైటిసిలో ఎంపిపి ఆదినారాయణ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఇన్‌ఛార్జి ఎంపిడిఒ మాస తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు. అధికారులు పూర్తి సమాచారంతో రావాలని సూచించారు.

మర్రెడ్డికి దేవకోటి శుభాకాంక్షలు

ప్రజాశక్తి-కొమరాడ

రాష్ట్ర వ్యవసాయ శాఖ అథారిటీ ఛైర్మన్‌గా నియమితులైన మర్రెడ్డి శ్రీనివాస్‌ను తెలుగు రైతు అరకు పార్లమెంట్ అధ్యక్షులు దేవకోటి వెంకట నాయుడు శనివారం మర్యాద పూర్వకంగా కలిసి, శుభాకాంక్షలు తెలిపారు.


మర్రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న దేవకోటి వెంకటనాయుడు

స్నేహితుడే చంపేశాడు

24 గంటల్లో నిందితుడ్ని పట్టుకున్న పోలీసులు

ప్రజాశక్తి - జామి

తోటి స్నేహితుడే తన మిత్రుడిని హతమార్చాడు. దొంగతనం చేసి, తన పేరు బయటపెట్టాడని కక్ష పెట్టుకుని.. చంపేసిన ఘటన కలకలం రేపింది. విజినిగిరి గ్రామంలో ఇటీవల హత్యకు గురైన గనివాడ అచ్చిబాబు మృతి కేసును సిఐ రవికుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ వీరజనార్ధన్ ఛేదించారు. దీనికి సంబందించి శనివారం పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను సిఐ వెల్లడించారు. విజినిగిరి గ్రామంలో హత్యకు గురైన గనివాడ అచ్చిబాబు, అదే గ్రామానికి చెందిన వెంపడావు సూరి బాబు మిత్రులు. మూడేళ్ల క్రితం సూరిబాబు ఒక సెల్‌ఫోన్, నగదు ఒక ఇంటిలో దొంగిలించాడు. కొట్టేసిన సెల్‌ఫోన్‌ను తన మిత్రుడైన అచ్చిబాబుకు ఇచ్చి అమ్మి పెట్టమని చెప్పాడు. దొంగతనం విషయం తెలియని అచ్చిబాబు జామిలో దీనిని అమ్మేందుకు ప్రయత్నించగా, అప్పటికే సెల్‌పోయిన వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు గాలిస్తుండగా జామిలో సెల్‌ఫోన్ అమ్ముతూ అచ్చిబాబు పోలీసులకు చిక్కాడు. అతనిని విచారించగా తనకేమీ తెలియదని సూరిబాబు అమ్మమని ఇవ్వడంతో అమ్మేందుకు వచ్చానని పోలీసులకు చెప్పాడు. దొంగతనంలో తన పేరు బయటపెట్టడం, గ్రామంలో పెద్దలు పంచాయతీ నిర్వహించి ఇద్దరికి చెరో మూడు వేలు జరిమాన విధిదించడంతో సూరిబాబు రగిలిపోయాడు. దీంతో తన పేరు బయటపెట్టిన అచ్చిబాబును చంపేస్తాని బెదిరించాడు. ఈ బెదిరింపులు ఎక్కువ కావడంతో అచ్చిబాబు హైదరాబాదు వెళ్లి పనిచేసుకుంటూ నాగుల చవితి పండగకు తన తల్లిను చూడటానికి తిరిగి స్వగ్రామం వచ్చాడు. పండగ అయిన తరువాత జామిలో వున్న అక్క కొండమ్మ ఇంటికి వెళ్లి హైదరాబాద్ వెళ్లిపోతున్నాని ఒక వందరూపాయిలు కావాలని తీసుకున్నాడు. హైదరాబాద్‌కు వెళ్లకుండా గురువారం సాయంత్రం తిరిగి స్వగ్రామానికి వచ్చేశాడు. అచ్చిబాబును గమనించిన సూరిబాబు తాను పాతకక్షలు మరిచిపోయాయానని, కలిసి మద్యం సేవిద్దామని చెప్పి గ్రామంలో ఉన్న బెల్టు షాపు వద్ద ఇద్దరూ మద్యం కొనుగోలు చేసి తాగారు. ఈ సమయంలో సెల్‌ఫోన్ వివాదం రేగింది. దీంతో ఇద్దరూ కొట్టుకున్నారు. అయితే సూరిబాబు విచక్షణ రహితంగా కొట్టడంతో అచ్చిబాబు చనిపోయాడు. మృతి చెందిన అచ్చిబాబును గ్రామ శివారు ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు తీసుకెళ్లి పడేసి విద్యుత్ షాక్‌తో చనిపోయినట్లు నమ్మిద్దామని ప్రయత్నం చేశాడు. అయితే మృతుని అక్క ఇచ్చిన ఫిర్యాదులో తన తమ్ముడును సూరిబాబు చంపేశాడని పేర్కొనడంతో ఆ కోణంలో విచారణ చేసి నిందితుడిని అరెస్టు చేశామని సిఐ తెలిపారు. సమావేశంలో ఎస్ఐ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలి

ప్రజాపోరును విజయవంతం చేయాలని సిపిఎం ఆధ్వర్యాన ప్రచారం

ప్రజాశక్తి-కొమరాడ

రోజురోజుకీ పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని సిపిఎం జిల్లా నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. సిపిఎం ప్రజా పోరుయాత్రలో భాగంగా శనివారం మండలంలోని కూనేరు సంతలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. మరోవైపు సర్దుబాటు ఛార్జీల పేరుతో విద్యుత్తు భారం మోపారని దుయ్యబట్టారు. వీటికి వ్యతిరేకంగా 14న తహశీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. సంతలో కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రచారం సాగింది.

సాలూరు రూరల్ : కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వాలు ఏర్పడిన నాటి నుండి ప్రతిరోజూ సామాన్య ప్రజానీకానికి ధరలు పెరుగుదలతో తీవ్ర ప్రభావం చూపుతుందని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎన్‌వై నాయుడు తెలిపారు. దీనికి వ్యతిరేకంగా సిపిఎం చేపడుతున్న ప్రజాపోరు యాత్రను విజయవంతం చేయాలని కోరారు. శనివారం పట్టణంలో మెయిన్ రోడ్డు, బ్యాంకు, తహశీల్దార్ కూడలిలో ప్రజాపోరు పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గత సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను పక్కనపెట్టి, విద్యుత్ సర్‌ఛార్జీల పేరుతో సామాన్యుడిపై మరింత భారం మోపారని విమర్శించారు. ముఖ్యమంత్రి విద్యుత్ ఛార్జీలు పెంచబోమని ఒకవైపు ప్రకటిస్తుంటే, మరోవైపు రోజుకోరూపంలో భారం మోపుతున్నారని దుయ్యబట్టారు. ప్రతిరోజూ నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతూనే ఉన్నాయని, వాటికి అడ్డూ అదుపూ వేయడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. వీటిపై ఈ నెల 8 నుంచి 14 వరకు ఇంటింటి ప్రచారం చేపట్టి, 14న తహశీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ నాయకులు శ్రీను, సీతయ్య, ఆదినారాయణ, శ్యామలమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాచిపెంట : ప్రజా పోరు యాత్రలో ప్రజలు భాగస్వాములు కావాలని సిపిఎం మండల నాయకులు మంచాల శ్రీనివాసరావు, కొర్ర కళ్యాణ్, కోరాడ ఈశ్వరరావు కోరారు. శుక్రవారం స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్సు వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల తర్వాత ప్రజల ఆదాయం పైసా పెరగలేదు కానీ నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటాయని ఆందోళన వ్యక్తంచేశారు. మరోవైపు ట్రూఅప్ ఛార్జీల భారం మోపడం దారుణమన్నారు. వెంటనే విద్యుత్తు ఛార్జీల పెంపును ఉపసంహరించుకోవాలని డిమాండ్‌చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం 14న తహశీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు.


కొమరాడ.. కూనేరు సంతలో ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు సాంబమూర్తి, తదితరులు


పాచిపెంట.. నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, ప్రజలు ;



సాలూరు రూరల్.. ప్రజాపోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

పాఠశాల బియ్యం పక్కదారిపై దర్యాప్తు


రికార్డులు తనిఖీ చేస్తున్న ఎఎస్‌డబ్ల్యుఒ సురేష్‌బాబు

ప్రజాశక్తి కొమరాడ

పార్వతీపురం ఐటిడిఎ పరిధిలోని ఉలిపిరి గిరిజన సంక్షేమ బాలిక ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన బియ్యం పక్కదారిపై అధికారులు దర్యాప్తు నిర్వహిస్తున్నారు. శనివారం ఎటిడబ్ల్యుఒ సురేష్ బాబు.. ఉలిపిరి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో ఉన్న స్టాక్‌రూం రికార్డులను పరిశీలించారు. పార్వతీపురం నుంచి ఉలిపిరి ఆశ్రమ పాఠశాలకు ట్రాక్టర్‌పై 90 బస్తాల బియ్యం తరలిస్తుండగా మార్గం మధ్యలో విక్రమపురం గ్రామంలో ఒక ఇంట్లోకి 35 బస్తాల బియ్యం తరలించినట్లు వార్తలు రావడంతో అధికారులు స్పందించారు. దీంతో అధికారుల ఆదేశాలు మేరకు దర్యాప్తుకు వచ్చినట్లు ఆయన తెలిపారు. ప్రతి నెలా రేషన్ పంపిణీలో భాగంగా ఈనెల 90 బస్తాలను పార్వతీపురం నుంచి జిసిసి ద్వారా పాఠశాలకు వార్డెన్ ట్రాక్టర్ సహాయంతో తీసుకువచ్చారని తెలిపారు. జిసిసి వాహనం లేకపోవడంతో వార్డెన్‌లే రేషన్ తమ పాఠశాలకు తీసుకువెళ్లేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

అందులో భాగంగా ట్రాక్టర్ సహాయంతో 90 బస్తాలు బియ్యం తరలిస్తుండగా అధిక లోడ్ కావడంతో ట్రాక్టర్ నడపడానికి ఇబ్బంది పడటంతో విక్రమపురం గ్రామంలో 35 బస్తాలు బియ్యం దించారని వివరించారు. ఇంతలోనే అధికారులకు సమాచారం రావడంతో ఆ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పాఠశాలలో స్టాక్ రూమ్‌లో ఉన్న బియ్యం రికార్డులను పరిశీలించి ఆ 35 బస్తాలతో కలిపి రికార్డు సక్రమంగా ఉందని ఎటిడబ్ల్యుఒ నిర్ధారించారు. పాఠశాలలో జరిగిన ఈ విషయంపై పూర్తిస్థాయిలో దర్యాప్తు నిర్వహించి ఉన్నత అధికారులకు నివేదికలు సమర్పిస్తామని తెలిపారు. ఆశ్రమ పాఠశాలలో బియ్యం, చెక్కిలు, ఇతర సామగ్రి అక్రమ రవాణా చేసినా, అక్రమంగా నిల్వ ఉంచినా, పక్కదారి పట్టినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయనతోపాటు వార్డెన్ అనిత, పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.


ఎస్‌పికి ఫిర్యాదు చేస్తున్న వైసిపి జిల్లా అధ్యక్షులు పరీక్షిత్‌రాజు, మాజీ ఎమ్మెల్యే జోగారావు

టిడిపి సోషల్ మీడియా దుష్ప్రచారం

చర్యలు తీసుకోవాలని ఎస్‌పికి వైసిపి ఫిర్యాదు

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

మాజీ ముఖ్యమంత్రి అధినేత జగన్మోహన్ రెడ్డి, ఆయన కుటుంబంపై టిడిపి సోషల్ మీడియా కార్యకర్తలు దుష్ప్రచారం చేస్తున్నారని, వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని వైసిపి జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం జిల్లా పోలీస్ అధికారి కార్యాలయంలో ఎస్‌పి ఎస్‌వి మాధవరెడ్డికి మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావుతో కలిసి వినతి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పాలనా వైఫల్యాలను, సూపర్ సిక్స్ పథకాలు అమలు కాకపోవడంతో సోషల్ మీడియాలో ప్రశ్నిస్తున్న వైసిపి సోషల్ మీడియా సభ్యులపై, మద్దతుదారులపై అక్రమ కేసులు బనాయించడం దారుణమన్నారు. స్టేషన్లలో పెట్టడం, కిడ్నాపులు చేయడం, వేధించడం ఇలా పలు విధాలుగా హింసిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇదెక్కడి న్యాయమని ప్రశ్నించిన వారందరిపైనా కూటమి ప్రభుత్వం దాడులకు దిగుతోందని, రాష్ట్రంలో రాజ్యాంగ బద్ధంగా పరిపాలన సాగడం లేదని చెప్పారు. రెడ్ బుక్ పాలన, మానసిక వికలాంగ పాలన కొనసాగుతుందని, ఇది రాష్ట్ర ప్రజల దౌర్భాగ్యమని అన్నారు. చాలా ప్రశాంతంగా, మర్యాదపూర్వకంగా ప్రవర్తించే సంప్రదాయాలున్న జిల్లాలో రాజకీయంగా, సిద్ధాంత పరంగా విమర్శలు ఉండాలి తప్ప వ్యక్తిగతంగా దూషణలకు వెళ్లడం, హేళనలు చేయడం ఎప్పుడూ లేదన్నారు. కూటమి ప్రభుత్వంలో అలాంటి పరిస్థితిని చూస్తున్నామని చెప్పారు. ఈ రకమైన సంప్రదాయానికి స్వస్తి పలకాలని మంత్రికి సూచించారు. ఏ ఒక్క సోషల్ మీడియా కార్యకర్తపై అక్రమ కేసులు బనాయించినా, వేధించినా... వారిపై పోరాడటానికి వైసిపి నాయకత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉందని స్పష్టంచేశారు. చట్టానికి లోబడి పోలీస్ యంత్రాంగం నడుచుకొని, జిల్లాలో శాంతిభద్రతలు సాఫీగా ఉండేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి మజ్జి శోభారాణి, జెడ్‌పిటిసి మామిడి బాబ్జీ, వైస్ ఎంపిపి బి.రవికుమార్, వైసిపి నాయకులు మంత్రి రవికుమార్, మండల అధ్యక్షులు బొమ్మి రమేష్, బలగ శ్రీరాములు నాయుడు, బలగ నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

గొప్ప కథకుడు కారా మాస్టారు

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

కాళీపట్నం రామారావు (కారా) మాస్టారు గొప్ప కథకుడని ప్రముఖ రచయిత గంటేడ గౌరినాయుడు కొనియాడారు. కథలకు ఇల్లు కట్టి సాహిత్య సేవతో సమాజ రుణం తీర్చుకున్న మహా రుషి అన్నారు. కీర్తిశేషులు కాళీపట్నం రామారావు మాస్టారు శత జయంతి వేడుకలను శనివారం పార్వతీపురం స్నేహ కళా సాహితీ ఆధ్వర్యంలో స్థానిక వేదాంత కళాశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బెలగాం భీమేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గౌరినాయుడు మాట్లాడారు. కారా మాస్టారి కథలు ఎంత గొప్పవో ఆయన సాహిత్యంపై వచ్చిన వేల పేజీల సమీక్షలు, విమర్శలు ఉదాహరణగా నిలుస్తాయన్నారు. యజ్ఞం కథపై వచ్చిన విమర్శ ప్రపంచంలో మరే భాషలోనూ కథ గురించి రాలేదని చెప్పారు. అందరూ కథలు రాస్తారని, గొప్పవాళ్లు మాత్రమే గొప్ప కథలు రాయగలరు, అందులో కారా మాస్టారుది అందెవేసిన చెయ్యి అన్నారు. భూగర్భ శాస్త్రజ్ఞులు చారిత్రక ఆధారాల కోసం భూమి పొరలను తవ్వినట్లు, కారా మాస్టారు కథల్ని కూడా అలా పొరలు పొరలుగా తవ్వుకోగలిగితే ఆయన సాహిత్య గొప్పతనం బయటపడుతుందని తెలిపారు.



మాట్లాడుతున్న రచయిత గంటేడ గౌరునాయుడు

అనంతరం రచయిత మల్లిపురం జగదీష్ మాట్లాడుతూ కారా మాస్టారుతో ఆయనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. సాహితీ లహరి వ్యవస్థాపకులు మంచిపల్లి శ్రీరాములు మాట్లాడుతూ జీవితంలో ఎదుర్కొన్న ఎన్నో ఒడిదొడుకుల్ని తన కథావస్తువులుగా స్వీకరించి తెలుగు సాహిత్యం ఉన్నంతవరకు నిలిచిపోయే కథలను కారా మాస్టారు రాశారని కొనియాడారు. కార్యక్రమంలో రచయితలు తేజ మూర్తుల ప్రకాశరావు, ఆకుల జగదీష్, జాగాన సింహాచలం, గంటేడ సోమేశ్వరరావు, ఎంవి రఘునాథశర్మ, చందనపల్లి గోపాలరావు, బెవరిపూడి శ్రీరామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు వృథా

ప్రజాశక్తి-మక్కువ

మండలంలోని నంద పంచాయతీలో ఇంటింటికి తాగునీటి సరఫరా పైపులు సక్రమంగా ఏర్పాటు చేయలేదు. దీంతో తాగునీరు వృథాగా పోతోందని గిరిజనులు ఆవేదన చెందుతున్నారు. రక్షిత మంచినీటి పథకం ట్యాంకు నుండి సరఫరా అయ్యే పైపులైను మురుగు కాలువ ద్వారా ఏర్పాటు చేశారని వాపోయారు. కొళాయికి నీటిని నిలువరించే ట్యాపులు లేకపోవడం నీటి వృథాకు ఒక కారణంగా చెబుతున్నారు. అధికారులు తాగునీటి వృథాని అరికట్టాలని వారంతా కోరుతన్నారు.


పైపు ద్వారా వృథాగా పోతున్న తాగునీరు

ఆశ్రమ పాఠశాలల్లో ప్రహరీలు నిర్మించాలి

ప్రజాశక్తి - కురుపాం


గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలకు ప్రహరీలు, మెస్‌లు నిర్మించాలని ఎస్‌ఎఫ్ఐ జియ్యమ్మవలస మండల నాయకులు కె..మల్లేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పాఠశాలలకు కనీసం ప్రహరీలు లేక విద్యార్థులు గదుల్లోకి విష సర్పాలు చేరి పాముకాటుకు బలై ఎంతో విద్యార్థుల మృత్యువాత పడ్డారని తెలిపారు. కిటికీలకు మెస్సులు లేక దోమలు కుట్టడంతో మలేరియా, డెంగీ జ్వరాలతో బాధపడి మరణించే సంఘటనలు ఎన్నో ఉన్నాయని చెప్పారు. వీటిని మంత్రి సంధ్యారాణికి వివరించామని తెలిపారు. వెంటనే ఈ సమస్యలు పరిష్కరించాలని కోరారు.


శ్యామలాంబ పండగ తేదీలను విడుదల చేస్తున్న మంత్రి సంధ్యారాణి

శ్యామలాంబ పండగ తేదీలు ఖరారు

ప్రజాశక్తి-సాలూరు

శ్యామలాంబ పండుగ తేదీలను గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి శనివారం ప్రకటించారు. పట్టణ ప్రముఖులు, జమిందార్ విక్రమ చంద్ర సన్యాసి రాజు, మాజీ ఎమ్మెల్యే భంజ్‌దేవ్ సమక్షంలో పండుగ నిర్వహణకు సంబంధించిన ముఖ్య ఘట్టాల సమయం, తేదీలను ప్రకటించారు. పండితులు నిర్ణయించిన అంశాలను ఆమె వివరించారు. డిసెంబర్ 3న గ్రామదేవతకు పసుపు కుంకుమ సమర్పించనున్నట్లు చెప్పారు. వచ్చే ఏడాది మే 19న తొలేళ్ల ఉత్సవం, 20న సిరిమానోత్సవం నిర్వహించడానికి ఏర్పాట్లు చేయాలని మంత్రి సంధ్యారాణి తెలిపారు. మార్చి నెల నుంచి పట్టణంలో వివాహాలకు ముహూర్తాలు తీయాలని చెప్పారు.


మండ పాఠశాలలో కూరగాయల సాగును పరిశీలిస్తున్న ఎంఇఒ చంద్రశేఖర్

ఆహ్లాదకరంగా మండ పాఠశాల

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

మండలంలోని మండ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆహ్లాదకర వాతావరణం కనిపిస్తోంది. పూలమొక్కలు, కూరగాయల సాగుతో అందంగా దర్శనమిస్తోంది. పాఠశాల ఆవరణలో ఖాళీ ప్రదేశంలో బెండ, చిక్కుడు, ఆనప, వంకాయ, అరటి పంటలతోపాటు బంతి పూల సాగు ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తోంది. పాఠశాల అభివృద్ధికి ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని గుర్తించి ఎంఇఒ చంద్రశేఖర్, సర్పంచి హైమావతి అభినందించారు.

ఓటు నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

18 ఏళ్లు నిండిన యువత ఓటు హక్కు నమోదు చేయించుకోవాలని గుమ్మలక్ష్మీపురం సర్పంచ్ బొత్తాడ గౌరీశంకర్రావు కోరారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పిఎస్ నెంబర్ 74, 75లో ఓటు హక్కు నమోదు చేయించుకోవచ్చునని తెలిపారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-వీరఘట్టం

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. మందులు పంపిణీ చేశారు. సుధీర ప్రాంతాల నుండి వచ్చిన గర్భిణులకు శ్రీసత్యసాయి నిత్య అన్నపూర్ణ సేవా సంస్థ భోజన సదుపాయం కల్పించింది. కార్యక్రమంలో సూపర్వైజర్ ఒ.శాంతికుమారి, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, గర్భిణులు పాల్గొన్నారు.

ఆహారం అందజేత

ప్రజాశక్తి-కొమరాడ

ప్రతి ఏడాది కార్తీక మాసంలో గర్భిణులకు భోజనం, పండ్లు అందజేస్తున్నట్లు విక్రమపురం సర్పంచ్ కె.శైలజ అన్నారు. శనివారం కెఆర్‌బిపురం, కొమరాడ పిహెచ్‌సిలకు తనిఖీల కోసం వచ్చిన గర్భిణులకు పండ్లు, భోజనాలను అందజేశారు. కార్యక్రమంలో డిసిఎంఎస్ మాజీ వైస్ ఛైర్మన్ కె.మల్లిబాబు తదితరులు ఉన్నారు.


మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

పూరిల్లు దగ్ధం

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో కేసరిజోడు పంచాయతీ దిబ్బగూడకు చెందిన సున్నాపురం నాగరాజు పూరిల్లు శనివారం సాయంత్రం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. దీంతో ధాన్యం, బియ్యం, దుస్తులు కాలి బూడిదయ్యాయి. కొత్తూరు నుంచి అగ్నిమాపక వాహనం వచ్చి మంటలను అదుపు చేసింది. కేసరిజోడు సర్పంచ్ సున్నాపురం రవి బాధితులను ఓదార్చారు. సుమారు రూ.50 వేల వరకు నష్టం వాటిల్లిందని విఆర్ఒ హరి అంచనా వేశారు.